www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 30 జనవరి 2023

5

తిరుపతి



ఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో క్రికెట్ విజయ్‌కు సన్మానం

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): రాయల్ ఫ్రంట్ పీపుల్ (ఆర్పీఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు విజయకుమార్ రాయల్‌ను ఘనంగా సన్మానించారు. క్రికెట్ క్రీడలో 14ఏళ్ల సుదీర్ఘ అనుభవం గల విజయ్ అనేక పోరాటాలతో, ఎన్నో సమస్యలను ఈ పోటీతత్వంను ఎదుర్కొన్నారని అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది మాసి కృష్ణమూర్తి, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మమతా కష్ణమూర్తి, రెడ్డిశేఖర్, సీనియర్ లెక్చరర్ అజయ్ ప్రసన్న, హేమంత్ రాయల్, ఆంజనేయులు రాయల్, ఓబుల్ రెడ్డి, దాము రాయల్, అడ్వకేట్ శ్రీనివాసులు రాయల్, కష్ణగౌడ్, హరియాదవ్, భార్గవ్ చౌదరి, అత్తర్ బాష, వేణు రాయల్, గుణశేఖర్ రాయల్, బెల్లంకొండ శ్రీనివాసులు, ఆర్పిఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా తీర్చిదిద్దుతాం..

టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్

- యువత అభ్యున్నతికే యువగళం
- సైకో జాధురెడ్డి పాలనలో అరాచకాలు
- వైసిపి పాలనను ప్రజలు తరిమికొడతారు

శాంతిపురం పాదయాత్రలో మాట్లాతున్న నారా లోకేష్

ప్రజాశక్తి - రామకుప్పం, శాంతిపురం: రాష్ట్రంలో వ్యవసాయాన్ని రైతులకు లాభసాటిగా తీర్చి దిద్దేందుకు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే అన్నివిధాల కషి చేస్తుందని ఆపార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా 3వ రోజు కుప్పం నియోజకవర్గం, రామకుప్పం మండల పరిధిలోని చెల్దిగానిపల్లి గ్రామంలో వ్యవసాయంపై ఆయన రైతులతో ముఖాముఖిగా సమీక్షించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలపై ఏ కరువు పెట్టారు. దీంతో టిడిపి అధికారంలోకి రాగానే... రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి, చిన్న సన్న కారు రైతులకు విరివిగా రుణాలు, సబ్సిడీలు అందిస్తామన్నారు. అదేవిధంగా రైతులకు అవసరమైన కోల్డ్ స్టోరేజ్‌లు, గ్రీన్‌హంట్లు, తదితరాలు అందించి.. వ్యవసాయానికి చేయూత ఇస్తామన్నారు. పెట్టుబడి, ఎరువులు, విత్తనాల ఖర్చు పెరిగిందని..దీన్ని తగ్గిస్తే రైతుకు లాభసాటిగా ఉంటుందన్నారు. అదేవిధంగా సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేపట్టేందుకు రైతులకు సహకరిస్తామని పేర్కొన్నారు. రైతుల కోరిక మేరకు ఈ ప్రాంతంలో టమోటో ప్రోసెసింగ్ యూనిట్ ఏర్పాటుతో పాటు, కోళ్ల పరిశ్రమ రైతులు, పట్టు పరిశ్రమ రైతులు, పాడి పరిశ్రమ రైతులను ఆదుకునేందుకు టిడిపి కషి చేస్తుందని ఆయన తెలిపారు. ముఖ్యంగా 630 కోట్లతో 90శాతం చేపట్టిన హంద్రీ నీవా కాలువ పనులు అధికారంలోకి వచ్చిన ఆరు నెలలు లో 10శాతం యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి కుప్పం నియోజకవర్గ ప్రజలకు తాగు,సాగు నీరు అందించి తీరుతామన్నారు. సిఎం జగన్‌రెడ్డి కుప్పం ప్రజలపై కపట ప్రేమ చూపిస్తున్నారని, చిత్తశుద్ధి ఉంటే కుప్పం అభివద్ధికి సహకరించాలన్నారు.

సంతలో రైతులతో మాట్లాడుతూ..

రాష్ట్ర యువత అభ్యున్నతికే యువగళం

రాష్ట్రంలో యువత సమస్యలు పరిష్కరించేందుకు యువగళం పాదయాత్ర ప్రారంభించామని, ఇందుకోసం ప్రణాళికలు కూడా సిద్ధం చేశామని నారా లోకేష్ పేర్కొన్నారు. ఈసందర్భంగా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు పండించిన పంటలకు సక్రమంగా గిట్టుబాటు ధర వైసిపి ప్రభుత్వం కల్పించలేదని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నిటిని ఏమయ్యాయని ప్రశ్నించారు. అరటి, బంగాళదుంప, పూలతోటలు, పట్టుపరిశ్రమ, తదితర ఉద్యనవన పంటలకు గిట్టుబాటు కల్పించాలని నారా లోకేష్‌కు రైతులు విన్నవించారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంవత్సరం కాలంలోనే తమ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రామకుప్పం మండలంలో ఏనుగుల పంట పొలాలను తొక్కి నాశనం చేస్తే గత టిడిపి ప్రభుత్వం నష్టపరిహారం అందించి అటవీ ప్రాంతంలో కాలువలు తవ్వకాలు, సోలార్ కంచె చేపట్టిందన్నారు. ఇప్పటి వైసిపి ప్రభుత్వం కనీసం ఏనుగులను మళ్లించేందుకు చర్యలు తీసుకోపోగా నష్టపరిహారం అందం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మచ్చలేని చరిత్ర తెలుగుదేశం పార్టీది అని, 16 నెలల జైలుకెళ్ళి వచ్చిన వ్యక్తి పలు కేసుల్లో ఏ వన్ ముద్దాయిగా ఉన్న వ్యక్తి జాదు రెడ్డి అన్నారు. ఆంధ్ర రాష్ట్రం నుంచి అమర రాజా, లులు, జాకీ, ఆదాని తదితర పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయిందని అన్నారు. నిరుద్యోగ సమస్యలు పెరిగి యువత కడుపుమండి పోస్టులు పెడితే వారిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపుతున్న దుర్మార్గపు ప్రభుత్వం అన్నారు. టిడిపి ప్రభుత్వం హంద్రీనీవా కాలువ పనులు 90శాతం పూర్తి చేయగా మూడు సంవత్సరాల ఎనిమిది నెలల కాలంలో 10 శాతం పనులు కూడా చేపట్టకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. రైతులకు కల్తీ వేరుశనగ విత్తనాలు ఇచ్చి రైతులను నష్ట ఊబిలోకి నట్టిన వైసీపీ ప్రభుత్వం రైతులకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ఎంతోమంది ముఖ్యమంత్రి వచ్చారుగానీ ప్రతిపక్షాల గొంతు నొక్కి... ప్రజలను పీడిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జాదు రెడ్డి అన్నారు. వైసిపి పాలనతో గడిచిన మూడు సంవత్సరాల కాలంలో రాష్ట్రం 30సంవత్సరాలు అభివద్ధిలో వెనక్కి పోయిందన్నారు. యువగళం.. మనగళం.. ప్రజాబలం అని లోకేష్ పిలుపునివ్వడంతో యువత కేరింతలతో హోరెత్తింది.

మెరుగైన వైద్యం అందుతోంది

జూనియర్ ఎన్‌టిఆర్

నారాయణ హాస్పిటల్ వద్ద నందమూరి ఫ్యామిలీ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

మా అన్న తారకరత్నకు గుండెకి సంబంధించి నారాయణ హాస్పిటల్లో మెరుగైన వైద్యమే అందుతుందని జూనియర్ ఎన్టీఆర్ చెప్పారు. యువగళం నారా లోకేష్ పాదయాత్ర ప్రారంభం రోజు సినీనటుడు నందమూరి తారకరత్న హార్ట్‌ఎటాక్‌కు గురైన విషయం తెలిసిందే. ఆయనను కుప్పం పీఈఎస్ మెడికల్ కాలేజీలో చికిత్సలు చేశారు. తారకరత్న ఆరోగ్యం విషమించడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని నారాయణ హదయాలయ హాస్పిటల్‌కి శనివారం తెల్లవారుజామున తరలించారు. శనివారం సాయంత్రం టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు హాస్పిటల్ చేరుకుని చేస్తున్న చికిత్సల గురించి ఆరా తీశారు. వాళ్ల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆదివారం జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణ్ రామ్, నారా బ్రాహ్మణి తదితరులు హాస్పిటల్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఆత్మబలంతోపాటు ఆయనకు అభిమానులు, తాత గారి ఆశీర్వాదం ఉందన్నారు. అన్న త్వరగా కోలుకొని, ఇదివరకు లాగా ఆనందంగా ఉండాలని ఆదేవుని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. బెడ్‌పై ఉన్న తారకరత్నను వెళ్లి చూశానని తెలిపారు. వైద్యంకు ఆయన స్పందిస్తున్నారని వైద్యులు చెప్పారు.

తారకరత్న ఆరోగ్యంపై ఆరా తీస్తున్న జూనియర్ ఎన్టీఆర్

కార్పొరేటర్ల తీరుతో..

ప్రజలకు అవస్థలు... అధికారులు బేజారు..



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: జవాబుదారిగా ఉండాల్సి కార్పొరేటర్లు వారీ తీరు వల్ల ఇటు ప్రజలు, అటు అధికార్లు, ప్రజాప్రతినిధులకు తీరనినష్టం కలుగుతోంది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు 2021న నూతన పాలకవర్గం ఏర్పడింది. కార్పొరేటర్లు వ్యవహరిస్తున్న తీరు వల్ల అధికార్ల పార్టీకి త్రీవనష్టం కలిగించేలా ఉంది. స్థానిక ఎంఎల్‌ఏ ఎన్నిసార్లు వారికి నచ్చజెప్పిన వారి తీరులో మార్పు రాకపోవడంతో వచ్చే ఏడాదిలో జరిగే అస్లెంబ్లీ ఎన్నికల్లో వైసిపిపై తీవ్రప్రభావం చూపే అవకాశం ఉందని పలువురు వ్యాఖనిస్తున్నారు. మున్సిపల్‌లో అక్రమకట్టడాలు భారీగా పెరిగాయి. మున్సిపల్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికార్లు అదేశాలను కూడా కార్పొరేటర్లు తిరస్కరిస్తున్నారు. 1నుంచి 50 డివిజన్‌లో ఎక్కడ చూసిన అక్రమకట్టడాలు వెలిశాయి. దీనికి కార్పొరేటర్ల మద్దతు ఉండడమే కారణం.

నగరంలో ఎక్కడైనా నిర్మాణా పనులు చేయాలంటే కార్పొరేటర్ల అనుమతి తప్పనిసరిగా ఉండాలి. లేదంటే ఇళ్ల నిర్మాణా పనులు జరగవు. టౌన్‌ప్లానింగ్ అధికార్లు నిర్మాణ పనులకు అనుమతులు ఇచ్చిన, కార్పొరేటర్లకు వారివాటా ఇచ్చుకోవాల్సి ఉంటుంది. లేదంటే నిర్మాణం చేసే యజమానికి ఇబ్బందులు తప్పవు. పెద్దకాపు లేవుట్‌లో ఓ వ్యక్తి కార్పొరేషన్ అనుమతి తీసుకోని నిర్మాణం పనులు చేపట్టారు. ఆ వార్డు అడ్మిన్ కూడా నిర్మాణ పనులు పరిశీలించారు. ఆ వార్డు అడ్మిన్, వాలంటీరు వచ్చి కార్పొరేటర్ అనుమతి లేదు కాబట్టి రూ.2లక్షలు ఇవ్వలని కోరారు. ఇంటి నిర్మాణ చేసుకున్నే యజమాని అంత ఇచ్చుకోలేనని కొంత ఇచ్చుకుంటానని అన్నారు. కార్పొరేటర్ సంబంధించిన వ్యక్తులకు డబ్బులు ఇచ్చారు. అయితే నిర్మాణ అనుమతులు మాత్రం సకాలంలో రాలేదు. ఇంటిని నిర్మించుకునే వ్యక్తి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. మరో డివిజన్‌లో మున్సిపల్ కార్పొరేషన్ అనుమతులు తీసుకుని ఇంటి నిర్మాణపనులు చేపట్టారు. ఇంటికి పన్ను విధించాల్సి ఉంది. పన్ను వేయాలంటే కార్పొరేటర్ అనుమతి తీసుకోవాలని వార్డు వాలంటీర్లు సూచించారు. దీంతో ఆ వ్యక్తి కార్పొరేటర్‌ను కలవకుండా ఉన్నతాధికారిని కలిసి తన సమస్యను చెప్పుకున్నారు. అయినా సరే కార్పొరేటర్ అనుమతి తీసుకోమని ఉచిత సలహ ఇచ్చారు. దీంతో చేసేది ఏమీ లేక ఆ వ్యక్తి కార్పొరేటర్‌ను కలిసి తనకు పన్ను వేయాలని వేడుకున్నారు. అందుకు తమకు ఎంతో కొంత ప్రతిఫలం చెల్లిస్తే తప్ప పన్నులు వేసేందానికి కుదరదని తెల్చి చెప్పారు. కార్పొరేటర్ అడిగిన సొమ్ము ఇచ్చిన తరువాతే ఇంటిపన్నులు వేసి రశీదు ఇచ్చారు. నగరంలో ఎక్కడ ఇంటినిర్మాణం జరిగిన కార్పొరేటర్లకు సంబంధించిన వ్యక్తులు ప్రత్యక్షమతారు. ఇంటినిర్మాణ పనులు చేయాలన్నా, ఆస్తిపన్నులు విధించాలన్నా, తాగునీటి పైపులైను కనెక్షన్లు తీసుకోవలన్నా, యుడిఎస్ కనెక్షన్లు తీసుకోవలన్నా, రోడ్లులో తోపుడు బండ్లు పెటుకోవలన్నా, కార్పొరేటర్ల అనుమతి లేకపోతే పనులు జరగడం లేదు. అసలు ఫైలు కదలవు కార్పొరేటర్ల ఆదేశాలు దిక్కరించి అధికార్లు పనులు చేస్తే కౌన్సిల్ సమావేశంలో అధికారిని లక్ష్యం చేసుకోని కార్పొరేటర్లు గోడవ చేసేవారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఏ చిన్న పనిచేయాలన్న కార్పొరేటర్ల అనుమతి తీసుకోక తప్పదు. ఈ విషయంపై స్థానిక ఎంఎల్‌ఏ కార్పొరేటర్ల తీరు మార్చుకోవాలన్ని హితవు పలికిన వారి తీరు మారడం లేదు. ఈ ప్రభావం వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీపై తీవ్రంగా చూపనుంది.

నూతన ఇన్నోవా క్రిస్టా బుకింగ్స్ ప్రారంభం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ : నూతన ఇన్నోవా క్రిస్టా బుకింగ్‌ను టయోటా కిల్లోస్కర్ మోటార్స్ ప్రారంభించిందని ఆ సంస్థ సేల్స్ అండ్ స్ట్రాటజిక్ మార్కెటింగ్ వైస్‌ప్రెసిడెంట్ అతుల్ సూద్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపీవీ విభాగంలో అగ్రగామిగా వెలుగొందుతున్న ప్రతిష్టాత్మిక ఇన్నోవా. ఈ వాహనం మొదటి తరపు మోడల్‌ను 2005లో విడుదల చేశారు. ఇప్పటివరకు ఒక మిలియన్‌కు పైగా యూనిట్ల విక్రయాలను జరుపుకుందని అన్నారు. ప్రతిష్టాత్మక ఇన్నోవా క్రిస్టా సరికొత్త ధడమైన మరియు రగ్డ్ ఫ్రంట్ ఫాసియా కలిగి ఉందని, ఇప్పుడు నాలుగు గ్రేడ్‌లలో డీజిల్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌లో లభిస్తున్నాయన్నారు. దీనిలో 5స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ ఎకో, పవర్ డ్రైవ్ మోడ్స్‌లో కలిగి ఉంటాయన్నారు. నూతన ఇన్నోవా క్రిస్టా, ఇన్నోవా హైక్రాస్‌లు ఇప్పుడు బుకింగ్స్ కోసం డీలర్లు ఆన్‌లైన్‌లో లభిస్తున్నాయి. తమ అభిమాన ఇన్నోవాను కోరుకునే మా వినియోగదారుల కోసం ఇప్పుడు బహుళ పవర్‌ట్రైన్స్ ఆస్వాదించేందుకు అందుబాటులో ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్‌కు మద్దతు

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): జాతీయ చేనేత ఐక్యవేదిక తెలంగాణ కమిటీ ఆధ్వర్యంలో జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణికి మద్దతు ప్రకటించారు. ఛలో జగిత్యాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం జగిత్యాలలో స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను నిరసిస్తూ భారీ సభ ఏర్పాటు చేశారు. బీసీ మహిళను రాజకీయంగా అనుకొదక్కడానికి ప్రయత్నిస్తున్న స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు వ్యతిరేకంగా నినదించారు. జాతీయ చేనేత ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ తరపున మద్దతు తెలిపి మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణికి అండగా ఉంటామని ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీరమోహన్, ప్రధాన కార్యదర్శి మ్యాడం రామకష్ణ, కోశాధికారి చిలువరి గణేష్, ఆంధ్రప్రదేశ్ అధికార ప్రతినిధి సిభాల వెంకటరమణ, ఆంధ్రప్రదేశ్ ఆర్గనైజేషన్ సెక్రటరీ చిన్నరెడ్డిబాబు, మహిళా విభాగం అధ్యక్షురాలు తార, ప్రధాన కార్యదర్శి గూడ లావణ్య, సహాయ కార్యదర్శి యంగలి రాజు, రాములు, కొక్కుల గణేష్, జాతీయ చేనేత ఐక్యవేదిక నల్గొండ జిల్లా అధ్యక్షులు తిరందాస్ వేణుగోపాల్, రావిరాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

చైర్‌పర్సన్ శ్రావణితో మాట్లాడుతున్న ఐక్యవేదిక నాయకులు

వైభవంగా భజనమండళ్ల శోభాయాత్ర

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో భజనమండళ్ల శోభాయాత్ర ఆదివారం సాయంత్రం వైభవంగా జరిగింది. మూడు రోజుల పాటు జరుగనున్న శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవ సంబరాల ప్రారంభంలో భాగంగా ఈకార్యక్రమం నిర్వహించారు. తిరుపతి రైల్వేస్టేషన్ వెనక వైపున గల మూడో సత్ర ప్రాంగణంలో ఉదయం 5 నుండి 7 గంటల వరకు భజన మండళ్లతో సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 8.30 నుండి 10.30 గంటల వరకు సంకీర్తనాలాపన జరిగింది. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు ధార్మిక సందేశం అందించారు. సాయంత్రం 4గంటలకు శ్రీగోవిందరాజస్వామివారి ఆలయం వద్ద టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి శ్రీఆనంద తీర్థాచార్యులు పూజలు నిర్వహించి శోభాయాత్రను ప్రారంభించారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ జయప్రదం చేయండి

మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర నాయకురాలు హేమలత

సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ, దేశాన్ని కాపాడుకుందాం, వ్యవసాయ రంగ సంక్షోభాన్ని ఎదుర్కొందాం, కార్మిక సమస్యల పరిష్కారానికి పోరాడుదామన్న నినాదంతో ఏప్రిల్ 5వ తేదీన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.హేమలత, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలకష్ణ తదితరులు పిలుపునిచ్చారు. ఆదివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన పై మూడు సంఘాల జిల్లా సదస్సు ఈ మేరకు తీర్మానించింది. కేంద్రంలోని మోడీ ప్రభుత్వ విధానాలను గుడ్డిగా రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్నదని, దేశంలో రైతులు లక్షలాది మంది ఆత్మహత్యలు చేసుకుంటుంటే, రాష్ట్రంలో వ్యవసాయ రంగ సంక్షోభం ముదిరి పాకాన పడుతున్న దశలో వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ మీటర్లు పెట్టి రైతుల జీవితాలతో జగన్మోహన్ రెడ్డి చెలగాటమాడుతున్నారని నేతలు విమర్శించారు. కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మిక హక్కులను కాల రాస్తున్నారని నేతలు ఆరోపించారు. గత మూడేళ్లలో దినసరి కూలీలు ఒకటిన్నర లక్షల మంది ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. ఏపీలో నిర్బంధం రాజ్యమేలుతోందని కార్మికసమస్యలు పెరిగిపోతున్నాయని, స్కీం వర్కర్లు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కాంట్రాక్ట్ కార్మికులు రెగ్యులరైజేషన్ కోసం పోరాడుతున్నారని, టీటీడీలోని కార్మికులు తక్కువ వేతనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేంద్రంలోని మోడీ రాష్ట్ర ప్రజలను మోసం చేశారని, ప్రత్యేక హోదా ఇస్తామని మాట తప్పారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులు హరిస్తున్నదని, జీఎస్టీ పేరిట చావులకు పన్నులు కట్టాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందని నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ గద్దె దిగాలని, విధానాలు మారాలని కోరుతూ ఏప్రిల్ 5నఛలో పార్లమెంటు పేరుతో జరిగే కార్యక్రమంలో తిరుపతి జిల్లాలోని యావత్ కార్మిక వర్గం భాగస్వాములు కావాలని నేతలు విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా కోశాధికారి కెఎన్‌ఎన్ ప్రసాదరావు ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు రమణయ్య, గురవమ్మ తదితరులు పాల్గొన్నారు.

అష్ఫాఖ్ - బిస్మిల్‌ల స్ఫూర్తితో..

మతోన్మాదుల్ని దేశం నుంచి తరిమేద్దాం!

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: అష్ఫాఖ్-బిస్మిల్ 1927లో దేశస్వాతంత్ర్యం కోసం చిరునవ్వుతో ప్రాణాలను బలిదానం చేశారని, ఒకరు గీత, ఒకరు ఖురాన్ విశ్వాసి అయినప్పటికీ, మా గురించి తలచుకోవాలంటే హిందూ ముస్లిం మధ్య ఐక్యత స్థాపించండి ఇది మా ఆఖరి కోరిక మా స్మతి చిహ్నం కూడా ఇదే కాగలదని అంతిమ సందేశమిచ్చారని జైభారత్ జాతీయ కార్యదర్శి లోకనాథ్ అన్నారు. ఆదివారం ఉదయం తిరుపతి ప్రకాశం రోడ్, మ్యూజిక్ కాలేజ్ పక్కన, అంబేద్కర్ భవన్‌లో జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఆ వీరుల స్ఫూర్తితో హిందూ, ముస్లిం ఐక్యతను స్థాపించడమే ప్రధాన లక్ష్యంగా జయహో సంస్థ ముందుకు పనిచేస్తుందని తెలిపారు. మతాల మధ్య చిచ్చుపెట్టే మతోన్మాదుల్ని బహిష్కరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని గుర్తు చేశారు. జయహో జాతీయ అధ్యక్షులు శ్రీశ్రీశ్రీ విజయశంకర స్వామి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన అష్ఫాఖ్ - బిస్మిల్, ఉద్ధమ్ సింగ్, వివేకానంద, నేతాజీ, గాంధీజీ - గఫార్ ఖాన్ స్ఫూర్తితో మతోన్మాదాల్ని మన దేశం నుంచి తరిమి వేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జయహో జాతీయ ప్రదాన కార్యదర్శి ముస్తక్ అహ్మద్ అభిలాష మాట్లాడుతూ మన భారతదేశం లౌకిక రాజ్యాంగం విభిన్నమైన మతాలు, సంస్కతులు కలిగిన దేశమని ముస్లిములు కూడా స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారని అందరం కలసి అన్నదమ్ముల జీవించాలని పిలుపునిచ్చారు. ఎస్సీ పోరాట వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశీ మాట్లాడుతూ అన్ని మతాల ప్రజల్లో ఐక్యతను స్థాపించేందుకు జయహో ఉద్యమం నేటి సమాజానికి అత్యవసరమని అన్నారు. తిరుపతి అధ్యక్షుడు షాహీ అమీన్ మాట్లాడుతూ హిందూ ముస్లిం మధ్య ఐక్యతను బలపర్చుటకు జయహో సమావేశాలు జిల్లా వ్యాప్తంగా వాడవాడల ప్రజలకు చైతన్యం కల్పిస్తామని అన్నారు. ఈసందర్భంగా తిరుపతి బాలాజీ జిల్లా కమిటీ అధ్యక్షులు గా షాహీ అమీన్, ప్రధాన కారదర్శి హరి, ఉపాధ్యక్షులుగా నందయ్య, కార్యదర్శులుగా పరమానందం సభ్యులు ఎన్నుకొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సభ్యులు మహేష్, స్వాతి, విజయ్‌పాల్గొన్నారు.

సిపిఎం కార్యాలయంలో చంద్రయ్యకు వీడ్కోలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: సిపిఎం కార్యాలయంలో పనిచేస్తున్న చంద్రయ్య దంపతులకు సిపిఎం నేతలు వీడ్కోలు పలికారు. నాలుగున్నర సంవత్సరాలుగా చంద్రయ్య జిల్లా కార్యాలయంలో పలు రకాల సేవలు అందించారని, వారి సేవలకు గుర్తుగా ఆదివారం కార్యాలయ సిబ్బంది సిఐటియు నేతలు కలిసి చంద్రయ్య దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా సిపిఎం నేత కందారపు మురళి ప్రసంగిస్తూ సిపిఎంలో పనిచేయడమంటే సామాజిక అవసరాలను తనదిగా భావించి చేయడమేనని అన్నారు. వ్యక్తిగత స్వార్థానికంటే సమాజ ప్రయోజనమే లక్ష్యంగా పనిచేసేవారు సిపిఎంలో అత్యధికులని గుర్తుచేశారు. చంద్రయ్య సామాజిక పోరాటాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలకు అండగా నిలబడ్డారని వారి కుటుంబానికి అభినందనలు తెలిపారు. ఐదేళ్లుగా సేవకు అవకాశం కల్పించిన పార్టీకి, సిపిఎం జిల్లా నేతలకు చంద్రయ్య, లక్ష్మమ్మ ధన్యవాదాలు తెలియజేశారు.

ఆదానీ కంపెనీల్లో

మోడీనే పెట్టుబడులు పెట్టించారు

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: కార్మికుల సంక్షేమ పథకాలకు తూట్లు పొడుస్తూ కార్మికుల కడుపులు కొడుతూ నరేంద్ర మోడీ కార్మికశాఖను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని, అదే బాటలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పయనిస్తున్నాడని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మూడవ మహాసభలు తిరుపతిలో ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. బైరాగిపట్టేడ ఆర్చ్ నుంచి పద్మావతి పార్క్ వరకు కార్మిక ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 100లక్షల కోట్లు అప్పులు చేసి దేశఅభివద్ధిని వెనక్కు నెట్టిన ఘనత మోడీకి దక్కుతుందన్నారు. మూడు శాతం మాత్రమే కార్పొరేట్ కంపెనీలు ప్రభుత్వాలకు పన్నులు కడుతున్నాయని 97 శాతం కార్మికుల ఉద్యోగులు పన్నులు కడుతున్నారనే విషయాన్ని మోడీ గ్రహించాలని అన్నారు. లక్షలాది మంది పనిచేస్తున్న అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. జగన్మోహన్ రెడ్డి ఒక లారీ ఇసుక ధర లక్ష రూపాయలకు చేర్చాలని ఉబలాట పడుతున్నారని మండిపడ్డారు. దీంతో భవన నిర్మాణ రంగం కుదిలైందని కార్మికులు పనులు లేక రోడ్డుమీద పడ్డారని చెప్పారు. రాష్ట్రంలో అసంఘటిత రంగంలో పనిచేస్తున్న 1.78కోట్ల మంది కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు కూలిరేట్లు పెంచకపోగా కార్మికశాఖను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, అదే బాటలో జగన్ మోహన్ రెడ్డి నడుస్తున్నారని విమర్శించారు. హక్కులు కాపాడుకుంటూ సమస్యల సాధన కోసం సమరశీల పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాధ్ రెడ్డి మాట్లాడుతూ జిఓ నెంబర్ ఒకటిని తీసుకొచ్చి ధర్నాలు, సభలు పెట్టకూడదు అని నియంతత్వ పోకడలతో జగన్ మోహన్‌రెడ్డి దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. హమాలి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, ఏఐటియుసి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కుమార్ రెడ్డి, రాధాకష్ణ, నగర అధ్యక్ష కార్యదర్శులు రాజా, ఎన్‌డి రవి, అంజిబాబు, రమణ, సాంబశివరావు, చంద్రశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

జర్నలిస్టులు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): నిత్యం వార్తల సేకరణలో నిమగ్నమయ్యే జర్నలిస్టులు తమ వ్యక్తిగత ఆరోగ్యంపై కూడా దష్టి సారించాలని ఏసీఏ చిత్తూరు జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షులు క్రికెట్ విజయకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో జేశాప్ జిల్లా నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం జరిగింది. ఈ సందర్భంగా జేశాప్ వ్యవస్థాపకులు, దివంగత సోడిశెట్టి దుర్గారావు చిత్ర పటానికి నివాళులు అర్పించారు. నూతన జిల్లా అధ్యక్షులుగా పులిగోరు శ్రీనివాసులు, కార్యదర్శిగా నెల్లూరు శ్రీనివాసులు, కోశాధికారిగా మంగళం సుబ్రహ్మణ్యంతో పాటు ఉపాధ్యక్షులుగా దుగ్గాణి ప్రసాద్, ఎన్.ప్రసాద్, ఘట్టమనేని శ్రీనివాసులు సంయుక్త కార్యదర్శిగా నల్లబోతుల ప్రసాద్, భూమిరెడ్డి నరేష్ రెడ్డి, అర్ధమాల కామేష్, షేక్ రిహాన్, కార్యవర్గ సభ్యులుగా ప్రతాప్, తులసీరామ్, ముని కష్ణారెడ్డి, అమర్నాథ్, చల్లా విజయ్ కుమార్, మునిశేఖర్, లోకేష్, భాస్కర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన క్రికెట్ విజయ్ కుమార్ మాట్లాడుతూ కరోనా సమయంలో ముఖ్యంగా జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇందుకు శారీరక శ్రమ లేకపోవడమే ప్రధాన కారణమన్నారు. తిరుపతి జర్నలిస్టులు క్రికెట్ లో క్రీడలో రాష్ట్ర స్థాయిలో చాంపియన్స్ గా రానిస్తుండటం సంతోషమన్నారు. ఇదే స్ఫూర్తితో జిల్లా క్రికెట్ సంఘం ద్వారా జర్నలిస్టుల క్రీడాభివద్ధికి తమ సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రముఖ సాహితీ కళారంగ వ్యవస్థాపకుడు కొత్తపల్లి మునిరత్నం మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం పరితపించే జర్నలిస్టులు నిత్యం ఏదో ఒక క్రీడలలో రాణించడంతో ఆరోగ్యంగా ఉండొచ్చని తెలిపారు. తిరుపతి ప్రెస్ క్లబ్ కార్యదర్శి పి.బాల చంద్ర మాట్లాడుతూ తిరుపతి జిల్లా జర్నలిస్టులు రాష్ట్ర స్థాయి క్రికెట్ లో రాణిస్తూ పతకాలు సాధిస్తుండటం అభినందనీయమన్నారు. ప్రెస్ క్లబ్ ద్వారా క్రీడా జర్నలిస్టులకు సంపూర్ణ సహకారాలు అందిస్తామన్నారు. జిల్లా జేశాప్ అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ సమాజాభివద్ధి కోసం పనిచేసే జర్నలిస్టులు క్రీడల్లో రాణించాలన్న ఆకాంక్షతో 11 ఏళ్ల క్రితం దుర్గారావు జేశాప్ ను స్థాపించారని గుర్తు చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులందరిని ఏకతాటిపైకి తీసుకువచ్చి క్రీడల అభివద్ధికి కషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జేశాప్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నాకర్, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, ఉపాధ్యక్షులు రామకష్ణ రాజు, వెంకటరెడ్డి, రాష్ట్ర సలహాదారు శ్రీనాథ్ రెడ్డి, కార్యదర్శి శివశంకరయ్య, ఉపకార్యదర్శి మోడియం ప్రసాద్, నరేష్, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, విజయ్, సుదర్శన్, పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు ఘన సత్కారం

ప్రజాశక్తి-పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఇంటికి విచ్చేసిన డిప్యూటీ సీఎం కే నారాయణస్వామిని, కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి స్వాగతించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఇరువురు కలిసి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పోలంరెడ్డి, శేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బాలసుబ్రహ్మణ్యం, జేసీఎస్ మండల ఛైర్మన్ కరణం రఘునాయుడు తదితరులు శాలువాలు కప్పి , పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు.

కేశవరంలో క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-కోట: కేశవరం పంచాయతీ పరిధిలో సంక్రాంతి సందర్భంగా ఈ నెల 10 నుంచి నిర్వహించిన కేశవరం ప్రీమియర్ లీగ్ లో 25 జట్లు పోటీలో పాల్గొనగా తుది పోరుకు కేశవరం, గూడూరు మధ్య 28వ తేదీన టాస్ గెలిచిన కేశవరం జట్టు బౌలింగ్ ఎంచుకోగా మొదటిగా బ్యాటింగ్ చేసిన గూడూరు జట్టు నిర్ణీత ఓవర్‌లకు 5 వికెట్ లు కోల్పోయి 66 పరుగులు సాధించగా.. 67 పరుగుల లక్ష్య సాధనలో బరిలోకి దిగిన కేశ వరం జట్టు 8.2 ఓవర్ లకి 67 పరుగుల లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించి కేశవరం జట్టు విజేతగా నిలిచి రూ.25 వేలు ప్రథమ బహుమతి గెలుచుకుంది. అలాగే ద్వితీయ బహుమతి రూ.15 వేలు గూడూరు జట్టు అందుకుంది. ప్రథమ బహుమతి సి హెచ్.నాగరాజు, వి.కోటీశ్వర ప్రసాద్, పి.వినోద్, ద్వితీయ బహుమతి జాహ్నవి ఫర్టిలైజర్స్ అధినేత సీహెచ్.నాగూర్ అందించారు. కార్యక్రమంలో కేశవరం జట్టు క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-కోట: మండలంలోని వంజివాక, ఉత్తమనెల్లూరు, గూడలి, కేశవరం గ్రామాల్లో రబీ సీజన్‌లో ఉండే పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్‌రావు, ఏడీఏ ధనంజయరెడ్డిల రబీ పంట పొలాలను స్థానిక కోట వ్యవసాయ అధికారి నిరంజన్ కుమార్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ క్రాప్ బుకింగ్ పై అవగాహన కల్పిస్తూ ఈకేవై సీ ప్రతిఒక్కరూ త్వరితగతిన చేయించుకోవాలని రైతులకు తెలిపారు.

దయనేడులో 'జనసేన' శ్రమదానం

ప్రజాశక్తి -తొట్టంబేడు: మండలంలోని పిల్లమేడు పంచాయతీ దయనేడు గ్రామానికి బస్సు సౌకర్యం లేదని గ్రామస్థులు జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుత దష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆమె జిల్లా కలెక్టర్, మండల అధికారుల దష్టికి తీసుకెళ్లారు. స్పందించకపోవడంతో జనసేన పార్టీ నాయకులు వినుత ఆధ్వర్యంలో ఆదివారం గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా ఉండటంతో శ్రమదానం చేసి కలవగుంట నుండి దయనేడుకు వెళ్లే మార్గం వరకు 2 కి.మీ వరకు గుంతలను పూడ్చి రోడ్డుకు ఇరువైపులా అడ్డుగా ఉన్న చెట్లను తొలగించారు. కార్యక్రమంలో తొట్టంబేడు మండల అధ్యక్షులు కొప్పాల గోపి, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు దండి రాఘవయ్య, శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షుడు భవాని శంకర్, నాయకులు రవి కుమార్ రెడ్డి, నితీష్ కుమార్, గణేష్, గాంధీ, బాలాజీ, వెంకటరమణ, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే యువతకు ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: యువత కోసం ప్రత్యేక మ్యానిఫెస్టో తెచ్చి ఉపాధి , ఉద్యోగాలు కల్పించి వారికి మంచి భవిష్యత్తు అందించేందుకే యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్ర చేస్తున్నారని నగరి నియోజకవర్గ పార్టీ ఇన్చార్జి గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు.. యువత భవిష్యత్తు ను నిర్వీర్యం చేసి , అంధకారం చేసిన వైసీపీ పాలనకు చరమగీతం పాడటానికి యువత ఐక్యంగా కదలిరావాలని.. కుప్పంలో జరుగుతున్న నారా లోకేష్ యువగళం పాదయాత్ర 3వ రోజు కలిసి నడిచారు. యువత భవిష్యత్తు కోసం నారా లోకేష్ యువగళం పాదయాత్రలో పాల్గొని సంఘీభావం తెలపాలని విజ్ఞప్తి చేశారు. వీరి వెంట చిత్తూరు పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముగరెడ్డి, తెలుగు యువత సభ్యులు ఉదయ్, నవీన్, కబిల్, చైతన్య, వాసు, ముత్తు, శేఖర్ పాల్గొన్నారు.

గొల్లపల్లిలో తాగునీటి సరఫరాకు చర్యలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు మండలం రామకష్ణాపురం పంచాయతీలోని గిరిజన కాలనీలో ఆదివారం సర్పంచ్ విరిత దేవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో తాగునీటికి చర్యలు చేపట్టారు. పైపులైను లీకేజీ కారణంగా గ్రామస్థులు ఇబ్బందులు పడుతుండటంతో మరమ్మతులు చేయించి ప్రజలకు నీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. ప్రజలందరూ పంచాయతీ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. నీటి వసతి కల్పించడంతో గిరిజన కాలనీ ప్రజలు, కసింకుప్పం వాసులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా సిపాయి సుబ్రహ్మణ్యం జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-రేణిగుంట: రష్ హాస్పిటల్ అధినేత వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ మాజీ అధ్యక్షులు డాక్టర్ సుబ్రహ్మణ్యం జన్మదిన వేడుకలు ఆదివారం వన్నెకులక్షత్రియ సంక్షేమ సంఘం నాయకులు రేణిగుంట బస్టాండ్ కూడలి వద్ద జన్మదిన ఘనంగా నిర్వహించారు. ముందుగా శాలువ, పూలమాలతో సత్కరించారు. అనంతరం రేణిగుంట ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకొని విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం రేణిగుంట బస్టాండ్ కూడలి వద్ద చేరుకొని ముందుగా ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేసి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పేదలకు తన హాస్పిటల్ ద్వారా మెరుగైన వైద్య సేవలు తక్కువ ఫీజుతో అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రేణిగుంట గంగమ్మ గుడి ఛైర్మన్ సోలా మల్లికార్జున్‌రెడ్డి, పసల మునిరెడ్డి, న్యాయవాది తిరుమలరెడ్డి, కన్నా రెడ్డి, సిటీ సుబ్రహ్మణ్యం, ఏలుమలై, దినేష్, రవి, రాజశేఖర్, చంద్ర రెడ్డి, రష్యా హాస్పిటల్ సిబ్బంది లక్ష్మీకాంత్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రష్ హాస్పిటల్ అధినేత డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం జన్మదిన వేడుకలు ఆదివారం పట్టణంలో ఘనంగా జరిగాయి. వన్నె కుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. రత్నం రెడ్డి, పెరుమాళ్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, ముని కష్ణారెడ్డి, చంద్రారెడ్డి, మిన్నల్ రవి, ఎమ్మెస్ రెడ్డి, బుజ్జి రెడ్డి, మధు రెడ్డి, మురళి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఎన్టీఆర్ భవన్లో సిపాయి జన్మదిన వేడుకలు నిర్వహించారు. గాలి చలపతి నాయుడు, చక్రాల ఉషా, దశరధాచారి తదితరులు పాల్గొన్నారు.

జేశాప్‌లో శ్రీకాళహస్తి పాత్రికేయులకు చోటు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: 'జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' ఉమ్మడి చిత్తూరు జిల్లా కమిటీలో శ్రీకాళహస్తి పాత్రికేయులకు స్థానం దక్కింది. సాక్షి విలేకరి నెల్లూరు శీను 'జేశాఫ్' కార్యదర్శిగా, వెలుగు ఇన్‌ఛార్జి కలవగుంట భరత్ రెడ్డి ఉపాధ్యక్షుడిగా, ప్రజాశక్తి విలేకరి కామేష్ జాయింట్ సెక్రటరీగా, సిటీ కేబుల్ ఇన్‌ఛార్జి మల్లెంబాకం మునికష్ణారెడ్డి ఈసీ మెంబర్ గా నియమిస్తూ జేశాఫ్ రాష్ట్ర కమిటీ తీర్మానించింది. జేశాఫ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం జిల్లా అధ్యక్షుడు శ్రీను అధ్యక్షతన ఆదివారం తిరుపతిలోని కేబీఆర్ హోటల్ లో ఘనంగా నిర్వహించారు. జర్నలిస్టుల్లో దాగిన క్రీడా ప్రతిభను వెలికి తీయడమే కాకుండా 'జేశాఫ్' బలోపేతానికి కృషి చేయాలని నూతన కమిటీ పిలుపునిచ్చింది.

సెల్ఫ్ డిఫెన్స్ మెకానిజంపై అవగాహన

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం మరియు విభాగం వారి ఆధ్వర్యంలో అలిపిరిలో ఉన్న ఎస్‌వీ బధిరుల పాఠశాలలోని బాలికలకు 'సెల్ఫ్ డిఫెన్స్ మెకానిజం' అనే అంశంపైన 27 నుంచి 29వ తేదీ వరకు మూడు రోజులు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మొదటగా మహిళా అధ్యయన కేంద్రం లెక్చరర్ డాక్టర్ కే .రాణి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో జరుగుతున్న అరాచకాలను ఎదుర్కోవాలంటే ప్రతి ఆడపిల్లకు చదువుతో పాటు కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని.. ఆడపిల్లల్లో అందులోనూ ప్రత్యేకించి బధిరులకు అవసరమని సూచించారు. వీటి ద్వారా ఆత్మవిశ్వాసము, ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. మానసికంగా, శారీరకంగాను ప్రతిఒక్కరూ దఢంగా ఉండాలని.. ప్రమాదాలను ముందుగానే పసిగట్టేలా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. జనరల్ సెక్రటరీ పి రత్నాకర్ కరాటే లోని మెలకువలు గత మూడు రోజులుగా బధిరుల బాలికలకు శిక్షణ ఇస్తూ ఆపద సమయంలో ఎదుటి వ్యక్తి నుంచి ఏ విధంగా తమను తాను రక్షించుకోవాలో నేర్పించారు. బధిరుల పాఠశాల ప్రిన్సిపల్ రమణమూర్తి, ఉపాధ్యాయులు గిరిజమ్మ ,కమల, పార్వతి, సంపూర్ణ మహిళా అధ్యయన కేంద్రం సిబ్బంది ప్రీతి, ఇంద్రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి-గూడూరు రూరల్: క్రీడలతోనే మానసికోల్లాసం, శారీరక దారుఢ్యం పెంపొందించుకోవచ్చని వైసీపీ సీనియర్ నాయకులు, గూడూరు మాజీ ఎంపీపీ చేవూరు విజయమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గూడూరు మండల పరిధిలోని నెర్నూరు యువత ఆధ్వర్యంలో యంగ్ స్టార్ క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహించారు. నెర్నూరు, తిరుపతిగారిపల్లి జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన తిరుపతిగారిపల్లి జట్టు 10 ఓవర్లకి 83 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన నెర్నూరు జట్టు 53 పరుగులకు అల్ ఔట్ అయ్యారు. విజేతగా తిరుపతిగారిపల్లి జట్టు నిలిచింది. రన్నర్‌గా నెర్నూరు జట్టు నిలిచింది. విజేతకు రూ.10 వేలు, షీల్డ్ ను చేవూరు విజయ మోహన్ రెడ్డి అందించారు. రన్నర్ కు రూ.5 వేలు నగదు, షీల్డ్‌ను ఇచ్చారు. కార్యక్రమంలో కష్ణబాబు, దానం సురేంద్రబాబు, పెంచల్ రావు , నోసిన మీరయ్య , హరినాథ్, దాసరి శ్రీనివాసులు , సూరబత్తిన సురేంద్ర, సూరబత్తిన వెంకటేశ్వర్లు, నోసిన కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

యువతతోనే భారతదేశ భవిష్యత్తు

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఆదివారం డి నోటిఫైడ్, నోమాడిక్ అండ్ సెమి నోమాడిక్ కమ్యూనిటీస్, మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్ మెంబర్ తురక నరసింహ సందర్శించి, పబ్లిక్ పాలసీ అండ్ యంత్రపాలజీ విద్యార్థులతో చర్చా గోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కతి సంప్రదాయాల గొప్పతనాన్ని, భిన్నత్వంలో ఏకత్వ ప్రత్యేకతని రాబోయే తరాలకు అందించే దిశగా పయనించాలని కోరారు. కాబోయే సివిల్ సర్వెంట్స్ సమాజానికి అంకిత భావంతో, నిస్వార్థ సేవలు అందించాలని పిలుపునిచ్చారు. వివిధ విభాగాధిపతులతో సమావేశమై మహిళా సాధికారతకు, ముఖ్యంగా ముఖ్య గ్రామీణ మహిళాభివద్ధికి వివిధ విభాగాలు చేపడుతున్నటువంటి కార్యకలాపాలను చర్చించి, కేంద్ర ప్రభుత్వం చేపట్టినటువంటి అనేక పథకాలను సద్వినియోగం చేసుకుంటూ , మహిళ సాధికారత కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ చిన్నయ్య, వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజిని , డీన్లు, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని పలమనేరు త్రినేత్ర పిరమిడ్ మాస్టర్ అరుణ పేర్కొన్నారు. స్థానిక త్రినేత్ర పిరమిడ్ ధ్యాన మందిరంలో ఆదివారం త్రినేత్ర పిరమిడ్ ధ్యానంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ అరుణ మాట్లాడుతూ అందరూ ధ్యానం చేయడానికి అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు మదన సుబ్రహ్మణ్యం, పురుషోత్తంశెట్టి, గిరి వర్మ, సుజాత, జ్ఞాన విద్యార్థులు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నాగరాజు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్, ఎంజీఎం హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం అల్లెమడుగు తుపాన్ సెంటర్లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో దాదాపు 150 మంది పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేసుకున్నారు. వైద్యులు ఉచితంగా మందులు, సలహాలు, సూచనలు అందజేశారు. ఎంజీఎం వైద్యులు, ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షుడు వీసీ వెంకటయ్య, పాత్రికేయుడు వెంకట్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

చర్చికి ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్ : యువ సంఘ సేవకుడు, జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి మరోసారి తన దాతత్వాన్ని చాటుకున్నారు. శ్రీకాళహస్తి మండలం జింగిలిపాళెంలో ఉన్న చర్చికి కలవగుంట భరత్‌రెడ్డి యూత్ ఆధ్వర్యంలో ఆదివారం ఏడు ఫ్యాన్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు కలవగుంట భరత్ రెడ్డికి కతజ్ఞతలు తెలియచేశారు. దాత సేవా గుణాన్ని కొనియాడారు. భరత్‌రెడ్డి యూత్ బాలాజీ రెడ్డి, వంశీ, వినయ్, మునిరెడ్డితో ఈ సహాయాన్ని చర్చకు అందించారు. కార్యక్రమంలో మాధురి, సబితా, ఈస్టర్, డానియల్, శామ్యూల్, రాజమ్మ, హరీష్, సుబ్బయ్య, సిపురా, రాహిలమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్వీయూ తెలుగు విభాగంలో వర్క్ షాప్

ప్రజాశక్తి-క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖలో సోమవారం నుంచి ఫిబ్రవరి మూడో తేదీవరకు వర్క్ షాప్ నిర్వహించనున్నట్లు తెలుగు విభాగాధిపతి ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మ తెలిపారు. మైసూరులోని భారతీయ భాషల అధ్యయన కేంద్రం (సి ఐ ఐ ఎల్) ఆర్థిక సౌజన్యంతో ఈ వర్క్ షాప్ చేపట్టార అని వెల్లడించారు. ఇందులో వివిధ ప్రాంతాలకు చెందిన 50 మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పరిశోధకులు ప్రతినిధులను ఎంపిక చేశారు. ఐదు రోజుల పాటు తెలుగు భాష బోధన, ప్రశ్నావళిని రూపొందించడం, మూల్యాంకనం చేయడం వంటి అంశాలపై నిపుణులు ఈ వర్క్ షాప్ లో అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ కె రాజారెడ్డి హాజరుకానున్నారు. సిఐఐఎల్ ప్రతినిధి డాక్టర్ పంకజ్ ద్వివేది ప్రారంభోపన్యాసం చేస్తారు. సి.ఐ.ఐ.ఎల్ పరిధిలోని నేషనల్ టెస్టింగ్ సర్వీస్ (ఎన్ టీ ఎస్) ప్రతినిధి డాక్టర్ బీరేష్ కుమార్ వర్క్ షాప్ లక్ష్యాలను వివరిస్తారు. సి ఐ ఐ ఎల్ ప్రతినిధులు డాక్టర్ ఆర్. శకుంతల, డాక్టర్ పీఆర్ హరినాథ్, డాక్టర్ ఎం. నారాయణరెడ్డి, అకడమిక్ అడ్వైజర్ ప్రొఫెసర్ పేట శ్రీనివాసులురెడ్డి పాల్గొంటారు.

రెడ్డిచిన్నప్పనాయుడు మృతి తీరనిలోటు

ప్రజాశక్తి-రొంపిచెర్ల: వైసీపీ నాయకుడు రెడ్డిచిన్నప్పనాయుడు మృతి పార్టీకి తీరని లోటు అని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. మంత్రి ఆదివారం రొంపిచెర్ల మండలంలోని దద్దాలవారి పల్లి లో జరిగిన రెడ్డి చిన్నప్ప నాయుడు కర్మక్రియలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెడ్డి చిన్నప్ప నాయుడు రాజకీయాలలో తనకు పెద్ద అండగా ఉన్నారని తెలిపారు. ఆయన లేకపోవడం తనకు పార్టీకి పెద్ద లోటు అన్నారు. మృతుని కుటుంబానికి తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు.

నూతన మండల కార్యవర్గం ఎంపిక

ప్రజాశక్తి-కోట: యూటీఎఫ్ ఆధ్వర్యంలో తోటపల్లి గూడూరు మండలశాఖ మండల కౌన్సిల్ సమావేశంలో నూతన మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు కోటేశ్వరరావు, జిల్లా నాయకులు శేషులు, దట్టం గోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం తోటపల్లి గూడూరు నూతన మండల కౌన్సిల్ సమావేశంలో మండల ప్రధాన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. గౌరవాధ్యక్షులుగా అక్రమ్ బాషా, అధ్యక్షులుగా జీవీ సుబ్బారెడ్డి, అసోసియేట్ అధ్యక్షులుగా సీ హెచ్ ఫణి కుమార్, అసోసియేట్ అధ్యక్షురాలు సీహెచ్ జసింత, ప్రధాన కార్యదర్శిగా వి.భాస్కర్‌రెడ్డి, కోశాధికారిగా మారుతి కుమార్, మహిళా కార్యదర్శిగా ఎస్.లలితలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, దయాకర్, ఎన్నికల అధికారి షాజిదా బేగం, పరిశీలకులు ఎన్. మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

కేబీఆర్‌పురంలో పైపులైన్ల ఏర్పాటు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: కేబీఆర్‌పురం గ్రామ పంచాయతీలో సచివాలయం వెనుక భాగం జగనన్న లేఔట్‌లో పైపులైన్ సుమారు 120 మీటర్లు తవ్వించి వేయించారు. ఆర్కే రోజా సహకారంతో పైపులైను ఏర్పాటు చేశామని సర్పంచి జానకి సుబ్రహ్మణ్యం, తెలుగు యాదవ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నా లోకనాథం తెలిపారు. అనంతరం గ్రామాభివృద్ధికి సహకారం అందిస్తున్న అన్నా లోకనాథాన్ని యువతతోపాటు గ్రామస్థులు పూలమాలతో సత్కరించారు.

ఘనంగా గ్రీన్ డెవలపర్స్ హోమ్ వార్షిక వేడుకలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): న్యూ బాలాజీ కాలనీలోని గ్రీన్ డెవలపర్స్ హోమ్‌లో ఆ సంస్థ 11వ వార్షికోత్సవం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ డిఫెన్స్ అధికారి భాస్కర్ రెడ్డి, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, రిటైర్డ్ సీఆర్పీఎఫ్ అధికారి జ్యోతి, రిటైర్డ్ సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ నన్నాయాచార్యలు, రిటైర్డ్ ప్రిన్సిపల్ బ్రహ్మానందం ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా గ్రీన్ డెవలపర్స్ హోమ్ వ్యవస్థాపక డైరెక్టర్ రమేష్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటు ధరల్లో ప్లాట్లను అందించి వారి సొంతింటి కల సాకారం చేస్తున్నామన్నారు. 2011లో స్థాపించిన తమ సంస్థ ద్వారా ఇప్పటికే 10 వెంచర్లను విజయవంతంగా నిర్వహించామన్నారు. రూ.6 నుంచి రూ.20 లక్షలకు ప్లాట్ విక్రయిస్తున్నామని, మధ్యతరగతి వారికి సైతం సొంతంగా ఇళ్లు నిర్మించుకోవడానికి నెలనెలా వాయిదాల పద్ధతిలో సొమ్ము చెల్లించుకునే సౌలభ్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 7075966533ని సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సీనియర్ సేల్స్ మేనేజర్లు లీలాప్రసాద్, వివేక్, హెచ్‌ఆర్ జీఎం రాము, రూప పాల్గొన్నారు.

సీనియర్ సైంటిస్ట్ అవార్డు

ప్రజాశక్తి-క్యాంపస్: మైక్రోబయాలజిస్ట్స్ సొసైటీ ఇండియా నాగ్‌పూర్‌లోని మొహదులాలోని తయవాడే కళాశాలలో జనవరి 22-24 వరకు " బయోటెక్నాలజీ ఫర్ బెటర్ టుమారో " అనే అంశంపై 1వ జాతీయ సదస్సును నిర్వహించింది. వివిధ క్యాటగిరీలలో జాతీయ స్థాయిలో అవార్డులను బహుకరించింది. ఇందులో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో అప్లైడ్ మైక్రోబయాలజీ విభాగం నందు ఆచార్య .పి.సువర్ణలతాదేవికి ఆమె పరిశోధనా కృషికి మన రాష్ట్రం నుంచి సీనియర్ సైంటిస్ట్ అవార్డును ప్రదానం చేసింది.

దస్తావేజులు పోయినవి

నా క్లయింట్ ప్రస్తుత తిరుపతి జిల్లా, పూర్వం నెల్లూరు జిల్లా, బందెలదొడ్డి వీధి, కాశిపేట, డోరు నెంబర్.13-414, వెంకటగిరి టౌన్ మరియు మండలం కాపురాస్తులు **బోగా చిన్న చెంచయ్య గారి కుమారుడు బోగా చెంచు ఈశ్వర బాబు** నాకు యిచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియజేయునది ఏమనగా..,

నా క్లయింట్ ది.18-01-2023 సం॥రం॥ తేదిన మండల తహసీల్దార్ ఆఫీసు వద్ద గల జిరాక్స్ సెంటర్ వద్ద జిరాక్స్ తీయించు నిమిత్తం వెళ్ళు చుండగా దారిమార్గములో నా క్లయింటు తన తండ్రి గారైన బోగా యానాది శెట్టి గారి కుమారుడు బోగా చిన్న చెంచయ్య గారి పేరున గల దస్తావేజులు:
1) దస్తావేజు నెం. 293/2004, సబ్-రిజిస్ట్రార్, వెంకటగిరి, తేది.28-04-2005,
2) దస్తావేజు నెం. 293/2004, సబ్ రిజిస్ట్రార్, వెంకటగిరి తేది.06-05-2004 వాటి యొక్క ఒరిజినల్ దస్తావేజులు, వాటి లింకు దస్తావేజులు, మరియు నా క్లయింట్ బోగా చెంచు ఈశ్వర బాబు పేరున గల దస్తావేజు నెం. 3705/2010, సబ్-రిజిస్ట్రార్, శంషాబాద్, హైదరాబాద్, తేది.21-12-2010 తాలూకు ఒరిజినల్ దస్తావేజు కాఫీలు పడిపోయినవి. సదరు దస్తావేజులు ఎవరికైనను దొరికినచో సహాయము చేయమని కోరి ప్రార్థించుచున్నాను.

పార్టీ చిరునామా
బోగా చెంచు ఈశ్వరబాబు
తండ్రి: చిన్న చెంచయ్య, వెంకటగిరి.
సెల్: 94407 34802

అడ్వకేట్ చిరునామా
దేవదాసు రామావతారము
అడ్వకేట్ మరియు నోటరీ
తాడేపల్లిగూడెం-534101. సెల్: 94407 14445